క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: మైలవరంలో కొత్తగా 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున తిరువూరు సెక్షన్‌కు ఒక ఫీడర్‌కు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని నూజివీడు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు. ఒక 132 కేవీ ఫీడర్ ద్వారా మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నందున ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. జూన్ 1వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుండే అవకాశం ఉన్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలో పునర్నిర్మిస్తున్న దాసాంజనేయస్వామి ఆలయానికి బుధవారం ఇరువురు దాతలు విరాళాలు అందజేశారు. వ్యాపార ప్రముఖుడు కుందా వెంకటేశ్వరరావు రూ.లక్ష, సినిమా థియేటర్స్ యజమాని సంకా రవిప్రసాద్ రూ.50 వేల విరాళాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, సంకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నారు. స్థానిక కొండ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన కుక్ కమ్ హెల్పర్‌లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం సిద్ధం చేయాలని, రుచికరంగా, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని ఆనంద్ కుమార్ అన్నారు. భోజనం తయారీ విధానాన్ని ఐఎఫ్ పీ ప్యానల్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు, సీసీహెచ్‌లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి బీ. శ్రీనివాసరావు విద్యార్థులతో అక్బర్, బీర్బల్ కథలు చదివించారు. మహాభారతం, రామాయణం, భాగవతం, భగవద్గీత వంటి ఇతిహాస గ్రంథాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కథలు, సామెతలు, పొడుపు కథలు తదితర వాటిని చెప్పించారు. సామెతలు, పొడుపు కథలు ఎలా వచ్చాయనే విషయాలను వివరించారు. అనంతరం క్యారమ్స్, చెస్, వైకుంఠపాళి తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో ముగ్గురు దివ్యాంగులకు దాతలు కృత్రిమ కాళ్లను అందజేశారు. హీల్ అవయవ కేంద్రంలో ధన శిక్ష చారిటీస్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు రవితేజ యాదవ్, రోహిత్ యాదవ్, పార్థసారథి యాదవ్‌లు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. తమ సంస్థ ద్వారా దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేయడంతో పాటు పేద విద్యార్థులకు విద్యను కొనసాగించడానికి ఆర్థిక సాయం చేస్తామని ధనశిక్ష చారిటబుల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీతఈఓ కూరపాటి అజయ్ కుమార్, అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తయారీపై శిక్షణ



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు న్యూట్రిషన్ మైక్రోనెట్స్ గల భోజనం అందించాలని కో–ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిత్తపూరు జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్నం భోజనం తయారీపై హెల్పర్లకు కుక్కర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోమవారం నుంచి శనివారం వరకు కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, కొవ్వు, విటమిన్లు ఉండేలా భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవు

- దీర్ఘకాలంగా పట్టించుకోని అధికారులు
- ఆక్రమణకు గురవుతున్న విలువైన స్థలాలు
- రూ.కోట్ల విలువైన భూములపై ఉదాసీనత



అన్యాక్రాంతమవుతున్న తిరువూరు నాళ్లా నారాయణ హైస్కూల్ స్థలం



పాత తిరువూరులో గృహ నిర్మాణాలకు ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలం

తిరువూరు: తిరువూరు పట్టణంలో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు అధికారుల పర్యవేక్షణ లేక ఆక్రమణకు గురవుతున్నాయి. దీర్ఘకాలంగా ఆయా స్థలాలకు తగిన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో చుట్టుపక్కల వారు ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున పాత బస్టాండ్ సెంటర్లో 35 ఏళ్ల కిందట నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరగా.. నాలుగు సంవత్సరాల కిందట వీటిని నిర్మూలించారు. 50 సెంట్లకు పైగా విలువైన స్థలానికి కనీస రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో అన్యాక్రాంతమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ స్థలంలో పోలీసు సిబ్బందికి నివాస గృహాలతో పాటు సర్కిల్ కార్యాలయం నిర్మించాలని పోలీసు శాఖ ప్రతిపాదించగా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది.

లే అవుట్లలో సామాజిక స్థలాలూ అన్యాక్రాంతం

పట్టణంలో గత 20 ఏళ్లుగా ఏర్పడిన లే అవుట్లలో గతంలో గ్రామ పంచాయతీకి, అనంతరం నగర పంచాయతీకి నిబంధనల మేరకు రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అప్పగించిన రెండు ఎకరాలకు పైగా సామాజిక స్థలాలపై కూడా అధికారుల పర్యవేక్షణ కరవైంది. పార్కులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఈ సామాజిక స్థలాలను వినియోగించాల్సి ఉండగా, లే అవుట్ల యజమానులే వాటిని ఇతరులకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై నగర పంచాయతీ అధికారులు సమగ్ర విచారణ జరిపి ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆక్రమణకు గురవుతున్న తిరువూరులోని పోలీసు క్వార్టర్స్ స్థలం




నిరుపయోగంగా పాత తిరువూరు రెవెన్యూ భూమి

నిరుపయోగంగా విలువైన స్థలాలు

గతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహణకు ఎస్ఎస్‌పీ కాలనీ సమీపంలో దాతలు ఇచ్చిన ఎకరం స్థలంలో నిర్మించిన భవనాలు ఆ పాఠశాల మూసివేతతో శిథిలావస్థకు చేరాయి. తదుపరి ఆ పాఠశాల స్థలం అన్యాక్రాంతమవుతోందని విద్యార్థులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. స్థలానికి రక్షణగా చుట్టూ కనీసం ప్రహరీ నిర్మాణం జరపాలని కోరుతున్నారు. పాత తిరువూరు బీసీ హాస్టల్ చుట్టుపక్కల ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నందున అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఈ స్థలాలను ప్రభుత్వం నిర్మించే హెచ్‌ఐజీ, ఎంఐజీ గృహాల నిమిత్తం కేటాయించాలని జిల్లా అధికారులు నిర్ణయించినప్పటికీ తదుపరి ఈ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదించాం



పాత బస్టాండ్ సెంటర్‌లోని పోలీస్ క్వార్టర్స్ తొలగించిన స్థలంలో మళ్లీ పోలీసు సిబ్బందికి నివాస గృహాలతో పాటు సర్కిల్ కార్యాలయం నిర్మించాలని ప్రతిపాదించాం. పోలీసు గృహ నిర్మాణ శాఖ తదుపరి చర్యలు తీసుకోవలసి ఉంది.

– అబ్దుల్ నబీ, పోలీస్ సీఐ, తిరువూరు

తాగునీరు సక్రమంగా అందించాలి



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న కౌన్సిలర్లు

తిరువూరు: వేసవిలో తిరువూరు పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరందించాలని నగర పంచాయతీ కౌన్సిలర్లు కోరారు. బుధవారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో పలు వార్డుల్లో నెలకొన్న మంచినీటి సమస్యపై చర్చించారు. కట్టలేరు పంపింగ్ స్కీంలో భూగర్భ జలాలు అడుగంటడంతో కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని అందించలేకపోతున్నామని, ట్యాంకర్లతో అన్ని వార్డులకూ మంచినీరందిస్తున్నామని చైర్‌పర్సన్ కస్తూరిబాయి తెలిపారు. పైపులైన్ల లీకేజీని అరికట్టాలని, తాగునీటి ఇబ్బందులు నివారించాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు కోరారు. వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు

ఆగిరిపల్లి: స్థానిక ఎస్ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ గుర్తింపును సకాలంలో రెన్యువల్ చేయని కారణంగా రద్దు చేసినట్లు ఎంఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 2024–25 సంవత్సరం నుంచి గుర్తింపు గల వేరే పాఠశాలలో చేర్పించాలని ఆయన పేర్కొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ఎ.కొండూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ అన్నారు. కృష్ణారావుపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు బుధవారం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పిల్లిపెసర 152 క్వింటాళ్లు, జీలుగ 250 క్వింటాళ్లు, జనుము 20 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ జిరాక్స్ తీసుకుని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేసుకోవాలన్నారు. జీలుగ కిలో రూ. 44, పిల్లిపెసర కిలో రూ. 67, జనుము కిలో రూ. 44లకు విక్రయిస్తున్నామని వివరించారు. ఏఈఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాల సరఫరా

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నామని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే వరి, పెసర, మినుము, కంది, కొర్ర, రాగి, నువ్వులు తదితర విత్తనాలు కావలసిన రైతులు ముందుగా ఆర్బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

రసాయన శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు శరత్‌బాబు

మైలవరం: రసాయన శాస్త్రంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మైలవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి. శరత్ బాబు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మైలవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం రసాయన శాస్త్రం గురించి ఉపాధ్యాయులు శరత్‌బాబు వివరించారు. రసాయన శాస్త్రంలో ఎలిమెంట్ యొక్క అవశ్యకతను వివరించారు. నిత్య జీవితంలో రసాయనిక ఎలిమెంట్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. తాగునీటిని శుద్ధి చేసుకునేందుకు, పంటలు పండించడంలోను రసాయనిక ఎలిమెంట్స్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అంతరిక్ష ప్రయోగంలో కూడా ఎలిమెంట్స్ అవశ్యకత ఉందన్నారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ. 4.28 లక్షలు



మేడూరు ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను అధికారులు బుధవారం లెక్కించారు. గడిచిన నాలుగు నెలలకు గాను రూ. 4,28,285 ఆదాయం లభించిందని ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

తలనీలాల పాట ద్వారా రూ. 1.01 లక్షలు..

ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించే తలనీలాలను ఏడాది పాటు పోగు చేసుకునే హక్కునకు నిర్వహించిన వేలం ద్వారా రూ. 1.01 లక్షల ఆదాయం లభించిందని ఆలయ మేనేజర్ తెలిపారు. ఆలయానికి చెందిన 4.7 ఎకరాల భూమి సాగు చేసుకునేందుకై కౌలు నిర్ధారణకు నిర్వహించిన వేలం ద్వారా రూ. 49,800 ఆదాయం వచ్చిందని చెప్పారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది లెక్కింపు చేశారు.

ఎస్ఎస్‌పీ కాలువ స్థలం ఆక్రమణల తొలగింపు



కొండపల్లి ఐడీఏలో ఎస్ఎస్‌పీ కాలువ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తున్న పొక్లెయిన్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పారిశ్రామికవాడలో ఆక్రమణకు గురైన నాగార్జున సాగర్ కాలువ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్థలంలో బుధవారం ఆక్రమణలు తొలగించారు. ఐడీఏ ఏర్పాటు సమయంలో కొంతమంది పారిశ్రామికవేత్తలు ఎస్ఎస్‌పీ కాలువ స్థలం ఆక్రమించి పరిశ్రమలు నెలకొల్పారు. దీనిపై గత 25 ఏళ్లుగా అధికారులు కోర్టును ఆశ్రయించి పోరాటం చేస్తున్నారు. గతంలోనే 35 పరిశ్రమలకు నోటీసులు అందజేశారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. ఆక్రమణకు గురైన స్థలం ఎస్ఎస్‌పీ కాలువకు చెందినదిగా కోర్టు నిర్ధారించడంతో అధికారులు ప్రొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టారు. అన్ని పరిశ్రమల్లో ఉన్న ఎస్ఎస్‌పీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ఎస్ఎస్‌పీ అధికారులు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

భారతీ కంపెనీ ఫాస్ట్ సెటింగ్ సిమెంట్ విడుదల



తాపీ పనివారలకు ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న విజయ్‌సింహ

నెమలి(గంపలగూడెం): సిమెంట్ వ్యాపారంలో ప్రముఖ సంస్థ అయిన భారతీ సిమెంట్ కంపెనీ నూతన టెక్నాలజీలో అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెటింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని కంపెనీ ఏరియా సేల్స్ ఇన్‌చార్జి విజయ్‌సింహ తెలిపారు. గంపలగూడెం మండలం నెమలిలో శ్రీ కృష్ణాంజనేయ ట్రేడర్స్ సహకారంతో కంపెనీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలు, కార్మికులకు సిమెంట్ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయ్‌సింహ మాట్లాడుతూ ఇతర కంపెనీల సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందన్నారు. భవనాల శ్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలకు ఈ సిమెంట్‌తో ఎంతగానో ప్రయోజనం, పటిష్టత ఉంటుందన్నారు. భారతీ సిమెంట్ వినియోగదార్లకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తుందని తెలిపారు. శ్లాబ్ సమయంలో కంపెనీ టెక్నీషియన్ వచ్చి పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు, కార్మికులకు కంపెనీ తరఫున ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ గూడూరు ప్రసాద్, తాపీ కార్మికులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

జేవీవీ సభ్యత్వ నమోదు ప్రారంభం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ బుధవారం తిరువూరులో ప్రారంభించారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు జేవీవీ కృషి చేస్తోందని గంగాధర్ తెలిపారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దా శ్రీనివాస్ తొలి సభ్యత్వం స్వీకరించారు. వేదిక సభ్యులు రాంప్రదీప్, సుధాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి

విస్సన్నపేట: ఓట్ల లెక్కింపు కార్యక్రమం జూన్ 4వ తేదీన ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సీఐ అబ్దుల్‌నబీ విజ్ఞప్తి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమం జూన్ 4 వ జరుగుతుందని, ఆ రోజు కానీ, మరుసటి రోజున కానీ ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా, కవ్వింపు చర్యలకు, అల్లర్లకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో కార్యకర్తలకు అవగాహన కల్పించి ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి గొడవలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు. ఎస్ఐ జి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 48 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 37 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొత్తం 587 మందికిగాను 550 మంది పరీక్ష రాశారు. నూజివీడు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 270 మందికిగాను 256 మంది, శ్రీ శారద జూనియర్ కళాశాలలో 317 మందికిగాను 294 మంది పరీక్షలు రాశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో 164 మందికిగాను 153 మంది పరీక్ష రాశారు.

క్రీడాకారులకు అభినందన

జగ్గయ్యపేట అర్బన్: జిల్లా అండర్–19 క్రికెట్ జట్టుకు కెప్టెన్, వైస్‌కెప్టెన్‌లుగా జగ్గయ్యపేటకు చెందిన ఏపీఏ, కేడీసీసీ, బీపీసాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న టి.వరుణ్‌సాత్విక్, ఎస్.భానువరప్రసాద్ ఎంపికయ్యారు. టి.వరుణ్ సాత్విక్, ఎస్.భానువరప్రసాద్‌లను జగ్గయ్యపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రాజశేఖరప్రసాద్ బుధవారం అభినందించారు. క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. క్రికెట్ కోచ్ ఎస్.రాజేంద్ర పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన వ్యాపారి అకుల ఉపేంద్ర తనకుమారుడు అకుల వినీత్‌కుమార్ జ్ఞాపకార్థం స్థానిక ముక్త్యాల రోడ్‌లో ప్రజలకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అనుబంధ విభాగం ఆనందవనం క్లబ్ అధ్యక్షుడు చిత్తలూరి శేఖర్, వాసవీ క్లబ్ రీజన్ సెక్రటరీ చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు పేరూరి నరసింహారావు, కర్లపాటి కొండ, రాయపూడి శ్రీకాంత్, ఎర్నాకుల రాంబాబు, పెనుగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో రైతులకు మేలు



మైలవరంలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు (ఫైల్)

మైలవరం: వేసవిలోనే దుక్కులు దున్నుకోవడం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మరి కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దుక్కులు దున్నుకోవడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవి సమయంలో పంట పొలాల్లో దుక్కులు దున్నుకోవడం వలన నేలలోకి గాలి ప్రవేశించడంతోపాటు లోపలి పొరల్లో ఉన్న పోషకాలు నేల ఉపరితలానికి చేరతాయి. పంటల కోత అనంతరం నేలపై ఉండే వరి మొదళ్లు దుక్కి దున్నడం వలన నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారతాయి. తద్వారా పంటలకు పోషకాల లభ్యత పెరుగుతుంది. దుక్కులు లోతుగా దున్నుకోవడం వలన వాన నీరు భూమిలోకి ఇంకి భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకుంటుంది. దీని ప్రభావం పంటల దిగుబడిపై ఉంటుంది. అంతేగాక దుక్కులు లోతుగా తీయడం వలన పొలాల్లో చీడ పురుగులు నాశనం అవుతాయి. పంట కోత తరువాత సేంద్రియ కార్బన్ అభివృద్ధి చెంది, భూసారం పెరుగుతుంది. నేలల్లో సూక్ష్మ జీవుల సంఖ్య పెరుగుతుంది. వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి వర్షం కురిసిన తరువాత పొలంలో గొర్రెల మందను తిప్పితే పైరు విస్తరించేందుకు బాగుంటుంది. నియోజకవర్గంలోని మైలవరం మండలంలో వరి 6 వేల ఎకరాలు, జి.కొండూరు మండలంలో 8 వేల ఎకరాలు, రెడ్డిగూడెం మండలంలో 10 వేల ఎకరాల్లో రైతులు పంట పండిస్తారు. అలాగే పత్తి, మిరప, మినుము, కూరగాయల పంటలు కూడా పండిస్తారు. మెట్ట ప్రాంతమైన మైలవరం పరిసర ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే భూములు దున్నుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

అదుపుతప్పి లారీని ఢీకొట్టిన కారు

ప్రయాణికులు క్షేమం



పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద అదుపుతప్పి లారీని ఢీకొట్టిన కారు

ఇబ్రహీంపట్నం: లారీని ఓవర్‌టేక్ చేయబోయిన కారు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టాడు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో బుధవారం తెల్లవారుజామున 65వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ కారులో ఏలూరుకు బయలుదేరారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్దకు రాగానే లారీని ఓవర్ టేక్ చేయబోయిన కారు డ్రైవర్ అదుపు తప్పి అదే లారీని వెనుక వైపు ఢీ కొట్టాడు. అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు తప్పించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సీట్ బెల్ట్‌లు పెట్టుకోవడం, ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఏఎస్ఐ సాధిక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ స్తంభాలు, లైన్ల పునరుద్ధరణ

ముసునూరు: ఇటీవల సంభవించిన ఈదురు గాలులు, వర్షం ధాటికి నేల వాలిన, పడిపోయిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని మండల విద్యుత్ ఏఈ హేమసుందర కుమార్ తెలిపారు. నూజివీడు విద్యుత్ శాఖ ఏడీఈ పోతురాజు ప్రత్యేక పర్యవేక్షణలో ముసునూరు–వలసపల్లి ప్రధాన రహదారిలో వాలిన, పడిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు బుధవారంతో పూర్తి చేశామన్నారు. కార్యక్రమాల్లో సబ్ ఇంజినీరు కేవీ సుబ్బారావు, విద్యుత్ లైన్‌మేన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరులో విద్యుత్ లైన్ల పనులు చేస్తున్న సిబ్బంది

టెన్త్ పరీక్షలకు 466 మంది హాజరు

నూజివీడు: డివిజన్‌లోని ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ సైన్స్ పరీక్షకు 466 మంది విద్యార్థులు హాజరయ్యారని డీవైఈఓ ఎం. సేవియా తెలిపారు. మొత్తం 895 మందికిగాను 429 మంది గైర్హాజరయ్యారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 202 మందికిగాను 100 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 197 మందికిగాను 115 మంది, ముసునూరు హైస్కూల్‌లో 186 మందికిగాను 112 మంది, చాట్రాయి హైస్కూల్ లో 99 మందికిగాను 53 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 211 మందికిగాను 119 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీఓలు పర్యవేక్షించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ముసునూరు: మహిళను దుర్భాషలాడి, అసభ్యకరంగా దాడి చేసిన వ్యక్తిపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలవల్లి శివారు కొత్తూరుకు చెందిన రాజబోయిన శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనంపై సూరేపల్లికి చెందిన గూండ్రు చందుతో కలిసి సూరేపల్లి వెళ్లారు. అదే రోజు సాయంత్రం సూరేపల్లిలో ఉన్న బైక్‌ను శ్రీనివాసరావు కొడుకు హర్షవర్ధన్ కొత్తూరులోని తమ ఇంటికి తీసుకొచ్చాడు. వారు బైక్‌పై వెళ్లినపుడు దానిలో గడ్డి కోసే కత్తి ఉందని, అది కనిపించడంలేదని, నెల రోజుల తర్వాత, ఈనెల 10న కొత్తూరులో కనిపించిన చందును శ్రీనివాసరావు భార్య లక్ష్మీ తిరుపతమ్మ అడిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న చందు ఆమెను దుర్భాషలాడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించి, కర్రతో దాడిచేశాడు. ఆమె కొడుకు హర్షవర్ధన్ అడ్డు రాగా అతని తలపై కర్రతో గట్టిగా కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. బాధితురాలు లక్ష్మీతిరుపతమ్మ బుధవారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కంచికచర్ల : స్థానిక వసంతకాలనీలో కొలువై ఉన్న నాగలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.